## మంచిమాట

ఏదో ఇస్తాడని కాదు, మనకు ఎన్నో ఇచ్చాడనే కృతజ్ఞతతో దైవాన్ని పూజించు.


# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com | సంపుటి : 01 సంచిక : 174 | మంగళవారం, 10, ఫిబ్రవరి 2026, | పేజీలు - 06 | వెల : 3/-


### సైబర్ నేరగాళ్ల వేధింపులు తాళలేక

## వ్యక్తి ఆత్మహత్య

**ములుగు, ఫిబ్రవరి 9, :** సైబర్ నేరగాళ్ల వేధింపులు ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. మూడు రోజులుగా సాగుతున్న మానసిక వేధింపులను తట్టుకోలేక ములుగు జిల్లా వెంకటాపురం మండలం తిప్పాపురం గ్రామానికి చెందిన కోరం రామారావు అనే వ్యక్తి బలవన్మ రణానికి పాల్పడ్డారు. మృతుడు రామారావు రాసిన సూసైడ్ నోట్ ప్రకారం, సైబర్ నేర గాళ్లు ఆయన ఫోన్‌ను హ్యాక్ చేశారు. గత మూడు రోజులుగా నిరంతరం ఫోన్ చేస్తూ, మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వేధింపులకు పాల్పడ్డారు. ఈ వేధింపులు భరించలేక రామారావు గడ్డి మందు తాగి ఆత్మహ త్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ.. పరిస్థితి విషమిం చడంతో రామారావు మృతి చెందారు. చనిపోయే ముందు రామారావు రాసిన నోటు ఇప్పుడు కలకలం రేపుతోంది. తన వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, ఫోన్ హ్యాక్ చేసి వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. తన ప్రాణం పోవడానికి కారణమైన సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆవేదనతో నోటులో కోరారు. రామారావు మృతితో తిప్పాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రెండేళ్ల అభివృద్ధిని చూసి

# ఓటేయండి

- పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- 12 ఏళ్ల బిజెపి పాలన, పదేళ్ల బిఆర్ఎస్ పాలన చూడండి
- రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం
- మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో
- తెలంగాణ రూపాయి ఇస్తే..42 పైసలే వాపస్ వస్తున్నాయి
- ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి
- దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ
- దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు
- ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు
- మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 9:** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు. బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో మిగతా2లో...

# సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

- బెంగాల్ సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 9 :** బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారంనాడు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' పక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను మిగతా2లో...

# స్పీకర్ తీరుపై విపక్షాల ఆగరహం

- అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచన
- ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 9 :** పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ మిగతా2లో...

## మధిరను రోల్ మోడల్‌గా

# తీర్చిదిద్దుతా...

- రాజకీయాలు కాదు..అభివృద్ధి ముఖ్యం
- ఎన్నికల ప్రచార సభలో డిప్యూటి సిఎం భట్టి



**ఖమ్మం,ఫిబ్రవరి 9 :** మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. మిగతా2లో...

## పదేళ్లలో చేయని అభివృద్ధి

# ఇప్పుడెలా చేస్తారు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా



**ఖమ్మం,ఫిబ్రవరి 9 :** రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలు సుకో లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు మిగతా2లో...




## 11న మున్సిపల్

# పరిధిలో సెలవు

**హైదరాబాద్,ఫిబ్రవరి 9 :** ఈ నెల11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల

# ప్రచారపర్వం

- 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- 11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు




**హైదరాబాద్,ఫిబ్రవరి 9 :** తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతా ల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నా యి. అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. మిగతా2లో...

## రెండేళ్ల తరవాత మళ్లీ

# అధికారం మాదే...

- పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు
- హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం
- భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



**జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి 9 :** రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మిగతా2లో...

## రెండేళ్ల పాలనలో కాంగ్రెస్

# చేసింది శూన్యం

- 420 హామీలు ఇచ్చి ఒక్క హామీనీ అమలు చేయలేదు
- మెదక్ పర్యటన అంటూనే వణుకుతున్న రేవంత్
- దుబ్బాక ప్రచారంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట,ఫిబ్రవరి 9 :** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు. ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మిగతా2లో...

## రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వకుండా కమీషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శించారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ మూతపడ్డ కోళ్లఫామ్స్, రైస్‌మిల్లుల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందన్నారు.

## అక్రిడిటేషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానం..

సిద్దిపేట,ఫిబ్రవరి 9:

2026-28 కి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను డీపీఆర్వో ఆఫీస్ లో సమర్పించాలన్నారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ ద్వారా ఈనెల 9 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని.. పథకాలు అమలు చేస్తే వస్తాయని హితవుపలికారు. బూతులు మాట్లాడే రేవంత్‌కు పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టుకల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు పెట్టిండని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చాడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి సురుకుపెట్టాలని అన్నారు. దుబ్బాక ఓటర్ల దెబ్బకు రేవంత్ రెడ్డికి దిమ్మ తిరగాలని అన్నారు. అలా కాకుండా కాంగ్రెస్‌కే ఓటేస్తే.. పథకాలు ఎగబెట్టినా నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి అంటారని తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేస్తే చూపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలవాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలు, అభివృద్ధితో పోలిస్తే ఈ డబ్బులు ఎంత అని ప్రశ్నించారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. దుబ్బాకను ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే బూతు లు తప్ప మంచిమాట రాదని అన్నారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేడని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ పక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఖీక్ష), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఖక్ష), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్టాం÷-రగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల పక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి.ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూ టీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ , డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక పక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకా రం, ప్ర త్యేకసమావేశంతోఈ ఎన్నికల పక్రియ పూర్తి కానుంది.

## రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మీ డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడి స్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్య మంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

## సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది. ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే మేమే జారీ చేస్తాం. అంతేకానీ సర్ పక్రియను అడ్డుకోవడాన్ని మాత్రం అనుమతించం. అన్ని రాష్ట్రాలు దీన్ని అర్థం చేసుకోవాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఎస్ఐఆర్ పక్రియలో 8,500 మంది ఆఫీసర్లు పాల్గొంటున్నట్టు విచారణ సందర్భంగా సీజేఐ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే తాము ఆమోదించి ఉండేవాళ్లమన్నారు. మైక్రో-అబ్జర్వర్ల స్థానంలో ఉపయోగించుకుంటున్న 8,000 మంది గ్రూప్-బి అధికారుల పేర్లు పంపడంలో ఎందుకు జాప్యం జరిగిందని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న తాము ఆదేశాలిస్తే ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎందుకు పంపించలేదని మమతాబెనర్జీని ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తన వాదన వినిపిస్తూ, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ బి-గ్రూప్ ఆఫీసర్లను అడగలేదని, అలాంటి రిక్వెస్ట్ కూడా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. ఓటర్ల స్థానికతను నిరూపించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడం లేదని బెంగాల్ ప్రభుత్వ న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. దీంతో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ఎన్నికల తుది జాబితా గడువును మరో వారం రోజుల పాటు ఫిబ్రవరి 21 వరకూ పొడిగిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

## స్పీకర్ తీరుపై విపక్షాల ఆగరహం

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

## ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసాలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం



హైదరాబాద్,ఫిబ్రవరి 9 : మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.ప్రతి ఓటరు బూత్ దగ్గరకు చేరుకునేలా చూడాలన్నారు. ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటేసాల చూడాలన్నారు.

## ముగిసిన జిహెచ్ఎంసి పదవీకాలం

- మేయర్ విజయలక్ష్మికి సన్మానం



హైదరాబాద్,ఫిబ్రవరి9 : నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. తన పదవి కాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారాన్ని మరువలేనని చెప్పారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అదనపు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం.. అక్కడ గుర్తించిన ఉత్తమ విధానాలతో కూడిన సమగ్ర అధ్యయన నివేదికను కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందజేసింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని కర్ణన్ తెలిపారు. కార్పొరేటర్లు లేవనెత్తిన ప్రజా సమస్యలను చాలా వరకు పరిష్కరించామని వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ పదవీకాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు.

## మధిరను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా...

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## పదవి విరమణ చేసిన పొంది వచ్చిన సైనికున్ని సన్మానం చేసిన సర్పంచ్, తదితరులు



**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 09(డిడి9వార్త న్యూస్):-**బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన బొమ్మిడి రాకేష్ భారత నౌకా దళంలో 15 సంవత్సరాలు సైనికుడుగా దేశ సేవ చేసి పదవి విరమణ పొంది సొంత గ్రామం ఆదివారం వచ్చారు. సోమవారం రోజు పదవి విరమణ చేసిన గ్రామసైనికుడుని బజార్ హత్నూర్ సర్పంచ్ పర్చ సాయన్న, ఉప సర్పంచ్ కొంగర్ల శారద రాజన్నలు శాలువా లతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బజార్ హత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పరచ సాయన్న, ఉప సర్పంచ్ కొంగర్ల శారదా రాజన్న,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

## బాన్సువాడలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల పరిశీలన





**బాన్సువాడ, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):**బా న్సువాడ సబ్ కలెక్టర్ సోమవారం ఎస్ఆర్ఎన్కె డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్ మరియు కౌంటింగ్ హాళ్లను బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సబ్ కలెక్టర్ నిశితంగా పరిశీలించి, భద్ర ̆త, సౌకర్యాల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు.
ఎన్నికల ప్రక్రియను పా రద ̆ర్శ కంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి అధికారుల కీలక సూచన

**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):**మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ మరియు ఇతర పోలింగ్ ఆఫీసర్లుగా నియమితులైన సిబ్బంది అందరూ మంగళవారం ఉదయం 8 గంటలకు తమకు కేటాయించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద హాజరై ఎన్నికల పోలింగ్ మెటీరియల్‌ను
స్వీకరించాలని అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం పోలింగ్ సిబ్బంది సమయపాలనతో విధులకు హాజరు కావాలని కామారెడ్డి నోడల్ ఆఫీసర్ (ట్రైనింగ్ మేనేజ్‌మెంట్), జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

## వైభవఅంగ శ్రీ రాజా రాజేశ్వర 12 వ వార్షికోత్సవము



**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో :(డిడి 9 వార్త న్యూస్ ) :**ఆదిలాబాద్ జిల్లా వర్త మన్నూర్ గ్రామంలో వైభావంగా శ్రీ రాజా రాజేశ్వర స్వామి వారి దేవాలయ12 వ వార్షికోత్సవ మహా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం లో భాగంగా వార్షికోత్సవ పనులు మూడు రోజుల ముందుగా భక్తి శ్రద్దలతో స్వామి వారి సేవకు పత్రులయ్యారు.అదేవిధంగా ఉదయం నుండి భజన కార్యక్రమలతో పల్లకి సేవ నిర్వహించారు. పల్లకి సేవలో గ్రామంలో వున్నా ప్రతీ గడపకు స్వామి వారి విగ్రహాలను ఊరిగింపు తీసుకొని పూజ లు నిర్వహించారు. పండితుల వేద మంత్రాలతో పూలతో అభిషేకం చేసి వైభవముగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్వతి మత పరమే శ్వరుని వివాహమహోత్సవము కన్నుల పండుగ గా నిర్వహించారు. యజ్ఞం తో పాటుగా అభి ̄షకం నిర్వహించి భక్తి ని చాటారు గ్రామమం లో భక్తి శ్రద్దలతో పండగ వాతావరణం నెల కొంది అనంతరం. అన్నదాన మహా ప్రసాద కార్యక్రమం నిర్వహించడం తో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు స్వామి వారి ఆశీస్సులు లు పొందారు.
గ్రామామూలోని ప్రజలే కాకుండా చుట్టూ ప్రక్కల గ్రామాలనుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజ కార్యక్రమలు నిర్వహించారు.

# మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

- అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటు తప్పనిసరి
- జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ఏ.ప్రమీల




**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డీడీ9 వార్త):**పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ఏ.ప్రమీల తెలిపారు.కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013 అమలులో ఉందని పేర్కొన్నారు. అశ్లీల వ్యాఖ్యలు, అసభ్య ప్రవర్తన, శారీరక వేధింపులు నేరమని స్పష్టం చేశారు.అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ వివరాలను తప్పనిసరిగా షీ బాక్స్ పోర్టల్ (http://shebox.wcd.gov.in) లో నమోదు చేయాలని సూచించారు. షీ బాక్స్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు వెంటనే ఐసీసీ ఏర్పాటు చేసి, పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కమిటీ సభ్యుల వివరాలను జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయానికి అందించాలని తెలిపారు.షీ బాక్స్ పోర్టల్ ద్వారా మహిళలు తమ ఫిర్యాదులను నమోదు చేసి, వాటి స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని, సంఘటన జరిగిన మూడు నెలల లోపు ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఐసీసీ కమిటీలో అధ్యక్షురాలిగా సీనియర్ మహిళా ఉద్యోగి ఉండాలని, కనీసం ఇద్దరు సభ్యులు మహిళా హక్కులు లేదా సామాజిక సేవలపై అవగాహన కలిగినవారై ఉండాలని, ఒక బాహ్య సభ్యుడు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కమిటీలో కనీసం 50 శాతం మహిళలు ఉండాలని స్పష్టం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100 ను సంప్రదించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సూచించారు.

# ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2026

- కేవైసీ అప్‌డేషన్‌పై ప్రత్యేక దృష్టి



**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డీడీ9 వార్త):**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు కేవైసీ' అనే ఇతివృత్తంతో ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 13 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు--2026 నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వారోత్సవాల సందర్భంగా రీ కేవైసీ, సీకేవైసీ అప్‌డేషన్, నిద్రాణ ఖాతాల పునరుద్ధరణ, ఖాతా నిర్వహణతో పాటు కేవైసీ సంబంధిత మోసాల నివారణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఒక బ్యాంకు శాఖ ఒక గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు--2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలోని ప్రజలందరూ తమ సీకేవైసీ, రీ--కేవైసీని సకాలంలో అప్‌డేట్ చేసుకోవాలని, నిద్రాణ ఖాతాలను పునరుద్ధరించుకోవాలని, అలాగే కేవైసీ సంబంధిత సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం కామారెడ్డి జె. చంద్రశేఖర్, కామారెడ్డి బ్రాంచ్ నుండి వి. వినోద్, ఎన్‌డీసీసీబీ బ్యాంక్ నుండి రాకేష్ కుమార్, యూనియన్ బ్యాంక్ నుండి సుజీత్, ఐఓబి బ్యాంక్ నుండి సాగర్తో పాటు ఇతర బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం

- 153 మంది ఉపాధ్యాయుల రక్తదానం
  కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రశంసలు









**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):** పీఆర్టీయూ టిఎస్ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా పీఆర్టీయూ భవన్‌లో రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు అల్లాపూర్ కుశాల్ అధ్యక్షత వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 153 మంది ఉపాధ్యాయులు, పీఆర్టీయూ నాయకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా విలువలకు ప్రతీకగా నిలిచారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, "పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించింది. అంతేకాకుండా సమాజానికి అవసరమైన ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడే అవకాశాన్ని కల్పిస్తున్న పీఆర్టీయూ సేవాభావం ప్రశంసనీయం. గతంలో వరద సహాయ నిధికి రూ.7 లక్షలు విరాళంగా అందించిన విషయం కూడా మరిచిపోలేనిదే. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను మరింత పెంపొందిస్తాయి" అని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ,
"పీఆర్టీయూ సంఘం 50 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు సమాజ సేవను కూడా లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని" ఆకాంక్షించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న మాట్లాడుతూ, "పీఆర్టీయూ సంఘం గత ఆరు సంవత్సరాలుగా నిరంతరంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, రెండు సార్లు గవర్నర్ గారి ప్రశంసలు అందుకోవడం గర్వకారణం. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తదానం అత్యంత అవసరం" అని పేర్కొన్నారు. రక్తదాన శిబిరం అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులను కామారెడ్డి జిల్లా పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కుశాల్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుశాల్, ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, డిఈవో రాజు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రాజన్న, రాష్ట్ర బాధ్యులు మధుసూదన్ రెడ్డి, రమేష్ రెడ్డి, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు, పీఆర్టీయూ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతు భరోసాకు రూపాయలు .9వేల కోట్లు అప్పు




**బజార్ హత్నూర్,ఫిబ్రవరి, 09(డిడి9వార్త న్యూస్):-**ఇచ్చేందుకు ఓకే చెప్పిన రిజర్వుబ్యాంక్రూ.90వేల కోట్లకు చేరిన రాష్ట్ర రుణం. ప్రస్తుత యాసంగి సీజన్కు సంబంధించి రైతు భరోసా నిధుల కోసం మరో రూపాయలు.9 వేల కోట్లు కావాలని కోరు తూరిజర్వు బ్యాంకును అభ్యర్థించింది. దీనికి ఆర్బీఐ అంగీకరించింది. ఈనెల 10న ప్రభుత్వ ఖజానాకు నిధులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఈ రుణాన్ని 13 ఏండ్ల కాలపరిమితితో రూపాయలు.రెండు వేల కోట్లు,16ఏండ్ల కాలపరిమితితో రూపాయలు.రెండు వేల కోట్లు,21 ఏండ్లతో రూపా యలు.2,500 కోట్లు, 27 ఏండ్ల కాల
పరిమితితో రూపాయలు.2,500 కోట్లు చొప్పున మొత్తం రూపాయలు.9 వేల కోట్లు తీసుకుంటున్నట్టు తెలిసింది.
మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతు భరోసా సొమ్మును ఖాతా
ల్లో జమచేస్తామని సీఎం రేవంత్రెడ్డి ప్రస్తుత ఎన్నికల ప్రచార సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగాతీసుకుం
టున్న రూపాయలు.9 వేల కోట్ల అప్పుతో రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పు దాదాపు రూపాయలు.90 వేల కోట్లకు చేరు
తున్నది. జనవరి 10వ తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూపాయలు.80,800 కోట్లు ఉన్నదని 'కాగ్' వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాలో ప్రభుత్వ అప్పు దాదాపు రూపాయలు. 54,009 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఆ అంచనాకు రెట్టింపు రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేసే అవకాశాలు ఉన్నాయని ఆర్థి
కరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇక 50 రోజులు మాత్ర
మే గడువు ఉన్న విషయం గమనార్హం

# మునిసిపల్ ఎన్నికల ప్రచారానికి నేటితో ముగింపు

- మునిసిపల్ ఎన్నికలు: 48 గంటల నిశ్శబ్ద కాలం అమలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష : రాష్ట్ర ఎన్నికల కమిషన్ హెచ్చరిక

**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):**తెలంగాణ మునిసిపాలిటీల చట్టం, 2019 లోని సెక్షన్ 209 ప్రకారం మునిసిపల్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు ముందు నిర్ణయించిన 48 గంటల నిశ్శబ్ద కాలాన్ని (సైలెన్స్ పీరియడ్) ఖచ్చితంగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఈ చట్టం ప్రకారం పోలింగ్ ప్రాంత పరిధిలో బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించడం, వాటిలో పాల్గొనడం లేదా ప్రసంగించడం నిషేధించబడుతుందని తెలిపింది. అలాగే సినిమాటోగ్రఫీ, టెలివిజన్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల ద్వారా ఎన్నికల ప్రచారం చేయడం, సంగీత కచేరీలు, నాటకాలు లేదా ఇతర వినోద కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆకర్షించే విధంగా ఎన్నికల విషయాలను ప్రచారం చేయడం కూడా పూర్తిగా నిషేధమని పేర్కొంది.ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రకటించబడిన అన్ని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో సోమవారం సాయంత్రం 5.00 గంటలతో అన్ని విధాల ఎన్నికల ప్రచారం పూర్తిగా ముగియాలని కమిషన్ ఆదేశించింది.చట్ట నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో తెలంగాణ మునిసిపాలిటీల చట్టం, 2019 లోని సెక్షన్ 209(2) ప్రకారం రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడే నేరంగా పరిగణించబడుతుందని హెచ్చరించింది.ఎన్నికల ప్రచార నిమిత్తం మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం కూడా సెక్షన్ 209(1)(బి) పరిధిలోకి వస్తుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రచార నిర్వాహకులు, ఎలక్ట్రానిక్ మీడియా ఇన్‌ఛార్జ్ మేనేజర్లు ఈ నిబంధనలను గమనించి చట్టానికి అనుగుణంగా ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.
ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి జి. లింగ్యా నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు ఈ ఆదేశాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, రేడియో, టీవీ చానెల్స్ ద్వారా
విస్తృతంగా ప్రచారం చేసి
అమలు చేయాలని కమిషన్ సూచించింది.

# మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరగాలి

- అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డీడీ9 వార్త):**జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం మినీ సమావేశ మందిరంలో సంబంధిత నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలపై అధికా రులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను చట్టబద్ధంగా, లోపాలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది పంపిణీ, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు వంటి కీలక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, షామియానాలు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలో చెక్‌లిస్టుల ప్రకారం పరికరాలు అందజేయాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను భద్రతతో స్ట్రాంగ్ రూంలకు తరలించి, కౌంటింగ్ రోజున నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు నిర్వహించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాలులో టేబుల్ ఏర్పాటు, సిబ్బంది నియామకం, సీసీ కెమెరాలు, బ్యారికేడ్లు, భద్రతా బందోబస్తు వంటి ఏర్పాట్లు కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు.రేపు మంగళవారం ఎన్నికల అధికారులు ఉదయం 7.00 గంటలకే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకొని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో వెళ్లాలని, ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, వివిధ శాఖల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కీలక ఆదేశాలు

- ప్రచార నిషేధం, డ్రై డే అమలు గుర్తింపు కార్డులు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డీడీ9 వార్త):**కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ఫిబ్రవరి 9 సాయంత్రం నుండి ఎన్నికల ప్రచారాలపై నిషేధం అమల్లోకి వచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.
ఫిబ్రవరి 9 సాయంత్రం 5.00 గంటల నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నాలుగు మున్సిపాలిటీల్లో అన్ని రకాల బహిరంగ ఎన్నికల ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధించబడ్డాయని వెల్లడించారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసిసి బృందాలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఆదేశించారు.మున్సిపల్ పోలింగ్ దృష్ట్యా ఫిబ్రవరి 9 సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసే వరకు మద్యం, కల్లు దుకాణాలను మూసివేయాలని తెలిపారు. అలాగే ఫిబ్రవరి 13న కౌంటింగ్ రోజున కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేసి డ్రై డే అమలు కొనసాగించాలని స్పష్టం చేశారు.ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చినప్పుడు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అందులో ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, బ్యాంక్ లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్, పెన్షన్ గుర్తింపు పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు తదితరాలు చెల్లుబాటు అవుతాయని తెలిపారు.
ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం
చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు.



# బాన్సువాడలో కాంగ్రెస్ ఎన్నికల సమీకరణాలు బలోపేతం



- కాసుల బాలరాజుతో కలిసి కీలక సమావేశం నిర్వహించిన
- డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్



**బాన్సువాడ, ఫిబ్రవరి 09(డీడీ9 వార్త):**కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమీకరణాలను బలోపేతం చేసే దిశగా జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కీలక సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన పార్టీ బలోపేతం, గెలుపు వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని, ఇంటింటి ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించాలని నాయకులకు పిలుపునిచ్చారు.
ప్రజల్లో పార్టీపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసి విజయం సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని మరింత
వేగవంతం చేయాలని నిర్ణయించారు.

## మూడో విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు
- ప్రశాంత్ కుమార్ సమక్షంలో నిర్వహణ పూర్తి





**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):**మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండ మైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో సోమవారం నిర్వహించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం నిబంధనలను కట్టుదిట్టంగా అనుసరిస్తూ ఈ ర్యాండమైజేషన్ చేపట్టారు. జిల్లాలో ఎన్నికలు జరగనున్న నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వర్తించనున్న ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులను
మూడో విడత ర్యాండ మైజేషన్ ద్వారా కేటాయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మదిమోహన్, సీపీఓ రఘు నందన్, ఎస్ఓ శివకుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర అధికారులు పాల్గొన్నారు .ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## ద్విచక్ర వాహన ప్రమాదం.. ఇద్దరికి గాయాలు
## మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పుప్పాల శంకర్‌కు తీవ్ర గాయాలు



**పోతంగల్, ఫిబ్రవరి 09 (డీడీ9 వార్త):**నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం జల్లపల్లి గ్రామ శివారులో ఆది వారం ద్విచక్ర వాహన ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, ఎగిడేల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్



నాయకుడు పుప్పాల శంకర్‌కు తీవ్ర గాయాల య్యాయి.బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా, జల్లపల్లి వద్ద రమేష్ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో శంకర్ ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది.ఈ ఘటనలో శంకర్ తలకు తీవ్ర గాయాలు కాగా, రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే పోతంగల్ 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి ఇద్దరినీ బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం శంకర్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటన విషయం తెలుసుకున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, శంకర్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ఈ ఘటనలో 108 పైలెట్ బి. రాజు, ఈఎంటి కె. నారాయణ సేవలు అందించారు.

## నేడు ఉట్నూర్ కే బి కాంప్లెక్స్ జాబ్ మేళా

**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 09(డిడి9వార్త న్యూస్):-**ఆదిలాబాద్ జిల్లాలోని సమగ్ర గిరిజనఅభివృద్ధిసంస్థఉట్నూర్అధ్వర్యంలో నేడు అనగా మంగళవారం రోజు ఉదయం
జాబ్ మేళా కే బి కాంప్లెక్స్ లోని వైటీసీ శిక్షణ కేంద్రం వద్ద ఉంటుంది అని ఐ టీ డి ఏ ప్రాజెక్టు అధికారి ఒక ప్రకటన లో తెలిపారు. ఆసక్తి గల గిరిజన యువతీ -యువకులు ఈ జాబ్మేళాను సద్వినియోగంచేసుకోవాలని ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ పోస్టు 200లు మిగితా విభాగంలలో సుమారు 500 ఉన్నవని చెప్పారు. వివిధ సాఫ్ట్ వేర్, పార్మాకం పెనీ, ఎలక్ట్రికల్,స్నేడర్ ఎలక్ట్రికల్, జి ఎమ్ఆర్,ఎయిర్ ఫోర్ట్, యూత్ 4,అంగవైకల్యం ఉన్న వారి కోసం కూడా అవకాశం ఉందన్నారు. జీతం రూపాయలు 10000-18000( ఈఎస్ఐ oఈపిఎఫ్ )తో కల్పి అందించబడునని అన్నారు. విద్యార్హతలు 10 వ తరగతి, ఇంటర్, డిగ్రీఉత్తీర్ణత/అనుత్తీర్ణత అయినా, విద్యా యోగ్యత పత్రాలు ఒరిజినల్ డజిరాక్స్ కాఫీలను తీసుకొని కే బి కాంప్లెక్స్ లో ఉదయం 10గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకోసం ఫోన్ నంబర్లు 9010295 910,96 66748105,9493535052 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



తెలంగాణ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ.
సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, ఉట్నూర్, ఆదిలాబాద్ జిల్లా.
పత్రిక ప్రకటన తేదీ: 08-02-2026.

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ITDA ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి గారి ఆదేశాల మేరకు తేదీ: 10-02-2026 మంగళవారం రోజున స్థానిక కొమురం భీం ప్రాంగణంలోని (K B Complex) యువజన శిక్షణ కేంద్రం (YTC, Utnoor) ఉట్నూర్ లో జాబ్ మేళా ను నిర్వహించడం జరుగుతుంది. కావున ఆసక్తిగల నిరుద్యోగ గిరిజన యువతీ-యువకులు ఇట్టి జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోగలరని శ్రీ యువరాజ్ మర్మాట్, ఐ.ఏ.యస్, ప్రాజెక్ట్ అధికారి గారు ఒక ప్రకటనలో తెలిపారు.

పాల్గొను కంపెనీలు:
1. G4S సెక్యూరిటీ గార్డ్ విప్రో సాఫ్ట్వేర్ మరియు కాగ్నిజెంట్ సాఫ్ట్వేర్ ఆఫీస్ లలో సుమారు 200 సెక్యూరిటీ గార్డ్ జాబ్స్ ఇవ్వడం జరుగుతుంది.
2. మెడిప్లస్, జెప్టో, కెఫ్ నిలూఫర్, ష్నైడర్ ఎలక్ట్రికల్స్, జి.ఎం.ఆర్. ఎయిర్‌పోర్ట్, Youth4Jobs (అంగవైకల్యం ఉన్నవారి కొరకు) మరియు ఇతర ప్రైవేట్ కంపెనీలలో సుమారు 500 ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయి. జీతం రూ.10,000 – రూ.18,000 (ESI + EPF తో కలిపి) అందించబడుతుంది. కావున ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన యువతీ- యువకులు, తమ యొక్క విద్యా అర్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ లతో తేదీ: 10-02-2026, ఉదయం 10 గం!లకు యువజన శిక్షణ కేంద్రం (YTC), (K B Complex) ఉట్నూర్ కార్యాలయంలో హాజరు కాగలరు.

అర్హతలు:
1. SSC/ ఇంటర్/ డిగ్రీ పాస్ /ఫెయిల్.
2. వయస్సు 18 సం" నుండి 35 సం" లోపు ఉండాలి.

మరిన్ని వివరాల కోసం సంప్రదించండి : 9010295910, 9666748105, 9493535052.

ప్రాజెక్ట్ అధికారి
ఐ.టి.డి.ఏ., ఉట్నూర్.

దీని యొక్క ప్రతి అన్ని దిన పత్రికలలో ప్రచురించుటకు కోరనైనది.

## సన్నబియ్యం స్వాహా.. వార్డెన్ సస్పెన్షన్

**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** పేద విద్యార్థుల కడుపు కొట్టి, వారికి అందాల్సిన సన్నబియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న హాస్టల్ వార్డెన్‌పై కలెక్టర్ ఇలా త్రిపాఠి కొరడా ఝుళిపించారు. నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం (బి) వార్డెన్ ఎం.జీవన్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి రాజగంగారాం రహస్య విచారణ జరిపారు. వార్డెన్ జీవన్ అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ రిపోర్టు ఆధారంగా తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, తక్షణమే సస్పెన్షన్ వేటు వేశారు. బియ్యం అక్రమ తరలింపు ఉదంతంపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని డీఎస్‌సీడీవోను కలెక్టర్
ఆదేశించారు. విచారణ ప్రక్రియ ముగిసే వరకు సదరు వార్డెన్ తన కార్యస్థానాన్ని విడిచి వెళ్లకూడదని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. విద్యార్థుల ఆహార విషయంలో అలసత్వం వహించినా, అక్రమాలకు పాల్పడినా సహించేది
లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ ఆంక్షల పహారా

- నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 163 దీచీూా సెక్షన్ అమలు
- ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడితే చర్యలు




**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ఈ నెల 11న జరగనున్న నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య కమిషనరేట్ పరిధిలో 163 దీచీూా ఉత్తర్వులు జారీ చేశారు. నలుగురి కంటే ఎక్కువ మంది వ్యక్తులు వీధుల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ గుమిగూడకూడదు. ఏదైనా చట్టబద్ధమైన సమావేశాలు నిర్వహించాలంటే సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఈ ఉత్తర్వులు సోమవారం సాయంత్రం 5 గంటల నుండి 14వ తేదీ ఉదయం 10 గంటల వరకు అమల్లో ఉంటాయని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## యాద్గార్‌పూర్ గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

- 70 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ





**కోటగిరి/పోతంగల్, ఫిబ్రవరి 09( డీడీ9వార్త):** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామంలో పశు ఘనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఎస్కే గౌస్ ప్రారంభించారు. ఈ శిబిరంలో గర్భకోశ సంబంధిత వ్యాధులతో ఉన్న పశువులకు 36, సాధారణ చికిత్సలు 12, నట్టల నివారణ చికిత్సలు 22మొత్తం 70 పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశుఘనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా చికిత్సలు అందజేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ సి.హెచ్. సురేష్‌కుమార్ 70 పశువులను పరిశీలించి అవసరమైన మందులు అందజేశారు. ఇటువంటి ఉచిత శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుధీర్ గౌడ్, గోపాల మిత్రులు తిరుపతి, తుకారం, నాగేష్, సాయిలు, మైత్రి రాజేష్, సిబ్బంది భూమేష్, సతీష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి.. అంబాటి వీణ గెలుపుకు సహకరించండి







**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్ అభ్యర్థి అంబాటి వీణ శ్రీనివాస్ చేపట్టిన ఎన్నికల ప్రచారం సోమవారం నాటికి ముగిసింది. డివిజన్ వ్యాప్తంగా పర్య టి తీంచిన ఆమెకు సామాన్య ప్రజా నీకం నుండి అపూర్వ స్పందన లభించింది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచే స్తానని హామీ ఇవ్వడంతో ఓటర్లు ఆమెకు మద్దతుగా నిలిచారు. ప్రచారంలో భాగంగా వీణ శ్రీనివాస్ ప్రతి బస్తీని సందర్శిస్తూ, స్థానిక కార్మికులు, మధ్యతరగతి ప్రజల గోడును విన్నారు. డ్రైనేజీ సమస్యలు, మంచినీటి కొరత, మరియు వీధి సౌకర్యాల లేమిపై ప్రజలు ఆమెకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధిలో వెనుకబడి ఉంది. ప్రజా పక్షపాతిగా మీ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని, నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అభ్యర్థి పట్ల ఉన్న నమ్మకంతో స్థానిక మహిళలు, యువకులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. అంబాటి వీణ గెలుపు – డివిజన్ అభివృద్ధి అనే నినాదాలతో ప్రచార కార్యక్రమం మార్మోగింది. ప్రజలు హారతులు పట్టి, తమ ఓటుతో ఆమెను గెలిపించుకుంటామని ఏకగ్రీవంగా హామీ ఇచ్చారు.

## పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**పోతంగల్, ఫిబ్రవరి 09 (డీడీ9 వార్త):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్ పట్టణాలలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ఎన్నికల ప్రచారంపై నిషేధం (సైలెన్స్ పీరియడ్) అమలులోకి వస్తుందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఆంక్షలు కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.
48 గంటల నిశ్శబ్ద కాలంలో ఎవరూ కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని హెచ్చరించారు.
ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు జిల్లాలోని మద్యం షాపులు, కల్లు దుకాణాలను పూర్తిగా మూసివేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## సుంకిని మంజీరా సరిహద్దుల్లో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- పగలు రాత్రి తేడా లేకుండా అక్రమ ఇసుక తరలింపు, భారీ డంపులు



**బాన్సువాడ, ఫిబ్రవరి 09(డీడీ9వార్త):** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలం సుంకిని గ్రామ మంజీరా నది సరిహద్దు ప్రాంతంలో ఇసుక మాఫియా యథేచ్ఛగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతోంది. సుంకిని గ్రామంతో పాటు చుట్టుపక్కల మంజీరా సరిహద్దు గ్రామాల నుంచి ప్రతిరోజూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా భారీగా ఇసుకను తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సుంకిని గ్రామ శివాలయం పక్కనే ఉన్న గుట్ట ప్రాంతంలో, అలాగే చైతన్ నగర్ గుట్ట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక డంపులు ఏర్పాటు చేసి అక్రమంగా విక్రయాలు సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నేరుగా ఇసుకను విక్రయిస్తుండగా, మరి కొందరు ముందుగా గుట్ట ప్రాంతాల్లో డంపులు చేసి అక్కడి నుంచే సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మంజీరా నదిలో ప్రతి రోజూ భారీగా ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు కన్నెత్తి చూడకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ అక్రమ త్రవ్వకాల వల్ల నది పరిసర ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందని, పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే ఎల్లారెడ్డి అభివృద్ధి

- ఇప్పుడు మదన్ మోహన్ నాయకత్వంలో మరింత వేగం
- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):** ఎల్లారెడ్డి పట్టణం గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అభివృద్ధి చెందిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో పట్టణం మరింత వేగంగా అభివృద్ధి బాటలో ముందుకెళ్తోందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షె ట్కార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ని ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎల్లారెడ్డి పట్టణంలో తట్టెడు మట్టి కూడా వేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ఎల్లారెడ్డి అభివృద్ధి జరిగిందని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే మదన్ మోహన్ ఎల్లారెడ్డిని దగ్గరుండి అన్ని తానై అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే నేడు ఎల్లారెడ్డిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎల్లారెడ్డి మినీ ట్యాంక్ బండ్, బస్ స్టాండ్, ఏటీసీ సెంటర్, అమృత్ 2.0 ప్రాజెక్టు, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర అనేక పనులు ప్రజలకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ఎల్లారెడ్డిని నేడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో సంపూర్ణ ఆధిపత్యం సాధించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధి కొనసాగాలంటే, సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అమలవ్వాలంటే ప్రజల తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండాలని కోరారు.

## తోట లక్ష్మీబాయి 13వ వర్ధంతి సందర్భంగా కోటగిరిలో ఉచిత వైద్య శిబిరం





**కోటగిరి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):** కోటగిరి మండల కేంద్రంలోని గ్రామ చావిడి ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. తోట లక్ష్మీబాయి 13వ వర్ధంతిని పురస్కరించుకొని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సామాజిక సేవకుడు తోట శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తల్లి కీర్తిశేషులు తోట లక్ష్మీబాయి స్వర్గస్తురాలై నేటితో 13 సంవత్సరాలు పూర్తయ్యాయి. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేయాలని ఆమె చెప్పిన మాటలను నిజం చేస్తూ, గ్రామ ప్రజలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలన్న ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ఆస్తులు ముఖ్యం కాదు, ఆరోగ్యం ముఖ్యం అన్న మా అమ్మగారి మాటలను ఈ కార్యక్రమం ద్వారా నిజం చేశానని" భావోద్వేగంగా తెలిపారు. అనంతరం డాక్టర్ ప్రణయ్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మంది పేద ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ, థైరాయిడ్, వెయిట్, ఆర్‌బీసీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, తోట సాయిలు, కూచి శ్రీనివాస్, కూచి సుభాష్, మోతిపేట రాజయ్య, కోయగూరు సాయిలు, ఎళ్లుట్ల పోతయ్య, గర్దాస్ గంగాధర్, నరేష్ యాదవ్, గాండ్ల వీరేశం, హాస్పిటల్ సిబ్బంది అశ్విని, మోహన్, రవి, సామాజిక సేవకుడు తోట శ్రీకాంత్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజాస్వామ్య పండుగకు పోలీస్ పహారా

- మున్సిపల్ ఎన్నికలకు 1500 మందితో బందోబస్తు
- ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలి : సీపీ సాయి చైతన్య
- అల్లరి మూకలపై నాన్ బెయిలబుల్ కేసులు



**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 11న జరిగే నిజామాబాద్ కార్పొరేషన్ సహా బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిపేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. సోమవారం ఆయన పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా నిఘా పెంచామని సీపీ వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా సుమారు 1500 మంది పోలీస్ సిబ్బందితో పాటు 3 ప్లాటూన్ల టీఎస్ఎస్పీ, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు విధుల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే 10 ఎఫ్ఎస్‌టీ, 12 ఎస్ఎస్‌టీ బృందాలు రంగంలోకి దిగాయని, తనిఖీల్లో సుమారు రూ. 22,926 విలువైన మద్యం సీజ్ చేశామన్నారు. ఎన్నికలకు ఆటంకం కలిగించే అవకాశం ఉన్న 162 మందిని గుర్తించి తహ సీల్దార్ల ముందు బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవు. గొడవలు సృష్టించే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తాం అని సీపీ హెచ్చరించారు. నియోజ కవర్గాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలులో ఉన్నందున, 5 గురి కంటే ఎక్కువ మంది గుమిగూడకూడదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు రోజు సాయంత్రం 5 గంటల కల్లా బయటి వ్యక్తులు ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లాలని ఆదేశించారు.

# నిజామాబాద్ నగరంలో ఫార్వర్డ్ బ్లాక్ జోరు

- కరిపే రాజు, జయలక్ష్మి ప్రచారానికి జనం నీరాజనం
- అడుగడుగునా పూలబాటలు.. మంగళహారతులు





**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం క్లైమాక్స్‌కు చేరుకుంది. చివరి రోజైన సోమవారం నగరంలోని 35, 36వ డివిజన్లు జనసంద్రాన్ని తలపించాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులుగా బరిలో ఉన్న కరిపే రాజు, కరిపే జయలక్ష్మి తమ ప్రచార జోరుతో ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. సింహం గుర్తుతో ఎన్నికల క్షేత్రంలో నిలిచిన ఈ దంపతులకు డివిజన్ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రచారం ముగింపు రోజు కావడంతో ఉదయం నుంచే కరిపే దంపతులు డివిజన్లలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ప్రతి గల్లీలోనూ మహిళలు గుమ్మాల వద్ద నిలబడి అభ్యర్థులకు మంగళహారతులు పట్టి, పూల వర్షం కురిపించారు. ప్రజల నుంచి వస్తున్న ఈ అపూర్వ స్పందన చూస్తుంటే, డివిజన్లలో మార్పు పవనాలు వీస్తున్నాయని స్పష్టమవుతోంది. స్థానిక సమస్యలపై అవగాహన ఉండటం, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారనే నమ్మకంతో ఓటర్లు జేజేలు పలుకుతున్నారు. మా డివిజన్ అభివృద్ధి కరిపే దంపతులతోనే సాధ్యం అంటూ స్థానిక ఓటర్లు బహిరంగంగానే మద్దతు ప్రకటిస్తున్నారు. 35, 36 డివిజన్లలో గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, ఆదర్శ డివిజన్లుగా తీర్చిదిద్దుతామని అభ్యర్థులు ఇచ్చిన హామీలకు ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. యువత, మహిళా ఓటర్లు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొనడం విశేషం. భారీ ఊరేగింపులు, డప్పు చప్పుళ్లతో ప్రచారం హోరెత్తింది. ఈ సందర్భంగా కరిపే రాజు, జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలు మరువలేనివి. నిరంతరం ప్రజా సేవలో ఉండే మమ్మల్ని ఆదరించి, సింహం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాం అని ఉద్వేగంగా పిలుపునిచ్చారు. ప్రచారం ముగిసే సమయానికి డివిజన్ అంతా పండుగ వాతావరణం నెలకొంది. కరిపే దంపతుల విజయం ఖాయమని వారి మద్దతుదారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- అధికారుల సమీక్షలో సీపీ పి.సాయి చైతన్య




**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**నిజామాబాద్ నగర కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో నిజామాబాద్ డివిజన్ అధికారులతో ఎన్నికల బందోబస్తుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహిఒచారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా డివిజన్ పరిధిలో గుర్తించిన సమస్యాత్మక,

అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాం

ఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం, నగదు పంపిణీ వంటి అక్రమాలను అరికట్టేందుకు అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘా పెంచాలి. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండే వారిని చెదరగొట్టేందుకు అవసరమైతే స్ట్రైకింగ్ ఫోర్స్ సేవలను వాడుకోవాలి. పోలింగ్ కేంద్రాల నిర్దేశిత పరిధిలో ప్రచారం, పార్టీ గుర్తుల ప్రదర్శన జరగకుండా మార్కింగ్ చేయించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, ఏసీపీ బి. ప్ర కాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్ మరియు ఇతర గ్రామీణ సీఐలు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

# అధికారంలో ఫోన్ టాపింగ్... ఇప్పుడు నీతులు కేటీఆర్‌పై భాస్కర్ రెడ్డి ఫైర్

- బాన్సువాడ అభివృద్ధి గురించి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదం
- 10 వేల కోట్ల అభివృద్ధి చేసిన పోచారంపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు
- బాన్సువాడలో ఎన్నికల ప్రచారంలో భాస్కర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు





**బాన్సువాడ, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):** అధికారంలో ఉన్న సమయంలో ఫోన్ టాపింగ్ చేసిన వ్యక్తి కేటీఆర్ అని అలాంటి వ్యక్తికి తమ నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని ఉమ్మడి జిల్లాల మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ తన చెల్లెలు కవితను కాపాడుకోలేని పరిస్థితిలో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి పోచారం శ్రీనివాసరెడ్డి రూ.10 వేల కోట్ల నిధులు తీసుకువచ్చి సమగ్ర అభివృద్ధి చేశారని తెలిపారు. సిరిసిల్ల మున్సిపాలిటీని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేని కేటీఆర్‌కు ఇతర నియోజకవర్గాలపై విమర్శలు చేసే హక్కు లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మద్దతుతో ఎమ్మెల్యే పోచారం నియోజకవర్గ అభివృద్ధికి రూ.727 కోట్ల నిధులు తీసుకువచ్చారని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రూ.50 కోట్ల బిల్లులను కూడా మంజూరు చేయించారని గుర్తు చేశారు. రాబోయే బాన్సువాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని భాస్కర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, గురు వినయ్, నార్ల సురేష్, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలకు తావుండొద్దు



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బుధవారం బోధన్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో డివిజన్ స్థాయి పోలీస్ అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డివిజన్ పరిధిలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించామని, అక్కడ అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిర్ణీత దూరం వరకు మార్కింగ్ చేయాలని, ఎటువంటి ప్రచారం గానీ, పార్టీ గుర్తుల ప్రదర్శన గానీ జరగకుండా చూడాలన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకోవడానికి అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్‌ల వద్ద నిఘా పెంచాలని ఆదేశించారు. అనుమానిత ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచి ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గుంపులుగా చేరే వారిని చెదరగొట్టేందుకు స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సేవలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ రోజున సిబ్బంది తెల్లవారుజాము నుంచే తమకు కేటాయించిన బూత్‌లలో అందుబాటులో ఉండాలని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉన్నా, ప్రలోభాలకు గురైనా సదరు సిబ్బందిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, బోధన్ ఎస్.హెచ్.ఓ వెంకట్ నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎలక్షన్ సెల్ ఇన్చార్జ్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 11న పోలింగ్, 13న కౌంటింగ్

- పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో సెలవులు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు కామారెడ్డి జిల్లాలో 2026లో నిర్వహించనున్న మున్సిపాలిటీలకు 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తేదీ 11.02.2026 (బుధవారం) కాగా, ఓట్ల లెక్కింపు 13.02.2026 (శుక్రవారం) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ రోజున కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని నోటిఫైడ్ ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ప్రభుత్వ సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అలాగే పోలింగ్‌కు ముందు రోజు 10.02.2026 మరియు పోలింగ్ రోజు 11.02.2026 నాడు పోలింగ్ ప్రయోజనాల కోసం వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు స్థానిక సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు కోసం వినియోగించే విద్యా సంస్థలకు 12.02.2026 మరియు 13.02.2026 తేదీల్లో స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కర్మాగారాలు, సంస్థల ఉద్యోగులకు పోలింగ్ రోజున స్థానిక సెలవు మంజూరు చేయాలని, అలాగే దుకాణాలు, వాణిజ్య సంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు కల్పించాలని ఆయన ఆదేశించారు. సంబంధిత అధి కారులు ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు.

# బషీరాబాద్ అభివృద్ధిపై గ్రామసభ సమీక్ష



**నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభ గ్రామ అభివృద్ధికి అద్దం పట్టింది. గత 50 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికను గ్రామస్తుల ముందు ఉంచడంతో పాటు, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పలు కీలక తీర్మానాలు చేశారు. 28 నూతన హై-పవర్ డే లైట్ల ఏర్పాటుతో ప్రధాన కూడళ్లలో చీకట్లు తొలగాయి. వాటర్ ట్యాంక్ పైకప్పు నిర్మాణం పూర్తి. ఇందిరమ్మ కాలనీలో కొత్త బోర్ మోటార్, పైప్‌లైన్ ద్వారా నీటి సమస్యకు పరిష్కారం. గ్రామంలోని అన్ని వార్డుల్లో మురుగు కాలువల పూడికతీత పనులు ముమ్మరంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 53 ఇంచుల ఎల్‌ఈడీ టీవీ బహుకరణ. గ్రామంలోని విగ్రహాలకు కొత్తగా రంగులు వేయించి సుందరీకరణ. గ్రామసభలో తీసుకున్న నిర్ణయాల్లో మత్తు పదార్థాల నియంత్రణ ప్రధానమైంది. గ్రామంలో డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా రూ. 2 లక్షల జరిమానా విధిస్తూ తీర్మానం చేశారు. నిందితులను పోలీసులకు అప్పగించి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమాచారం ఇచ్చిన వారికి నగదు పారితోషికం అందజేస్తారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతారు. వేసవిలో నీటి వృధాను అరికట్టాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించి బషీరాబాద్‌ను స్వచ్ఛ గ్రామంగా మార్చాలని సభ పిలుపునిచ్చింది.

# ఎన్నికల సన్నద్ధతపై సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 09ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న తరుణంలో బోధన్ పట్టణంలో ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. సోమవారం పట్టణంలోని విజయ మేరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బోధన్ సబ్ కలెక్టర్ సందర్శించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం కోసం సబ్ కలెక్టర్ పలు మండలాల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. బోధన్, రెంజల్, ఏడపల్లి, కోటగిరి మండలాల తహసీల్దార్లను ఎన్నికల అధికారులుగా నియమించారు. ఆయా మండలాల తహసీల్దార్లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. విజయ మేరీ పాఠశాలలోని ప్రతి విభాగాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్, సిబ్బందికి కేటాయించిన డ్యూటీ చార్టులను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించే సమయంలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని సూచించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, నిరంతర నిఘా మరియు లైటింగ్ వ్యవస్థపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు.

# మంజీరా నదిలో వ్యక్తి గల్లంతు

**బీర్కూర్, ఫిబ్రవరి 09(డిడి9 వార్త):**బీర్కూర్ మండల పరిధిలోని మంజీరా నదిలో ఓ వ్యక్తి గల్లంతైన ఘటన కలకలం రేపింది. బీర్కూర్ గ్రామానికి చెందిన నీరడి రవి (వయస్సు సుమారు 30) ఉదయం గొర్రెల కాపరిగా ఒకరోజు కూలికి వెళ్లాడు. మంజీరా పరివాహక ప్రాంతంలో గొర్రెలను మేపుతున్న సమయంలో నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండగా, గొర్రెలు నది దాటి అటువైపు వెళ్లడం గమనించిన రవి వాటి వెంబడి వెళ్లాడు. ఈ క్రమంలో నీటి ప్రవాహానికి లోనై మంజీరా నదిలో మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు.

ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం నుంచే గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు నాలుగు గంటల పాటు తీవ్రంగా గాలించినప్పటికీ

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.